క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రిజిస్టర్లను పరిశీలించారు. మహిళా ఆరోగ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించి మహిళలతో మాట్లాడారు. సమయ పాలన పాటించాలని, ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యులు శ్రీలేఖ, సీహెచ్‌వో రవీందర్, సూపర్ వైజర్‌లు ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఇంటి పన్ను వంద శాతం వసూలు చేసి గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని కార్యదర్శులకు ఎంపీవో సూర్యకాంత్ సూచించారు. మంగళవారం పెద్ద దేవిసింగ్ తండా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తండాల్లో ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

'బలగం' ప్రదర్శించుకోవచ్చు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మానవీయ కోణంలో ఉన్న బలగం సినిమాను ప్రొజెక్టర్‌ల ద్వారా ప్రదర్శించవచ్చని ఎస్సై తోట రాజేశ్ తెలిపారు. ప్రొజెక్టర్‌ల ద్వారా ప్రదర్శించటానికి సంబంధిత సినిమా అధీకృత యాజమాన్యం అనుమతినిచ్చిట్లు ఆయన పేర్కొన్నారు. సినిమాను అన్ని గ్రామాల్లో ప్రదర్శించి కుటుంబాల మధ్య సఖ్యతను పెంపొందించుటకు సర్పంచ్‌లు కృషి చేయాలని ఎస్సై తెలిపారు.

పలు చోట్ల సినిమా ప్రదర్శన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కుర్మగల్లీలో సోమవారం రాత్రి 'బలగం' సినిమాను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. విడిపోయిన కుటుంబాలను కలుపుతూ..చనిపోయిన కుటుంబీకుల విలువను గుర్తు చేస్తూ అందరిని ఆలోచింపజేస్తున్న బలగం సినిమా అందరి ప్రేమను పొందుతుందని కాలనీ వాసులు పేర్కొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బాన్సువాడ/నిజాంసాగర్: హనుమాన్ జయంతి, రంజాన్ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి, జుక్కల్ ఎస్సై మురళీలు సూచించారు. మంగళవారం బాన్సువాడ పట్టణం, జుక్కల్ మండల కేంద్రంలో వేర్వేరుగా వారు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 6న హనుమాన్ జయంతి పురస్కరించుకుని బాన్సువాడలో ర్యాలీ నిర్వహించే అవకాశం ఉందని, ర్యాలీ శాంతియుతంగా జరిగేలా సహకరించాలన్నారు. అలాగే రంజాన్ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

మేకల సంతకు వేలం

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం తైబజారు వేలం పాట నిర్వహించారు. గత నెల 21న తైబజారు వేలం పాట నిర్వహించారు. గత ఏడాది మేకల సంత రూ.45 లక్షలు వేలం పాట పాడి ఎల్లారెడ్డికి చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. ఈ ఏడాది మేకల సంతకు ముగ్గురు కాంట్రాక్టర్లు డీడీలు కట్టినా వేలం పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. మూడు సార్లు వేలం పాట నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో గత ఏడాది కంటే రూ.10 లక్షలు తగ్గించి పాట పాడాలని మున్సిపల్ అధికారులు సూచించడంతో కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరయ్యారు. ఈ సారి రూ.35.75 లక్షలకు ఎల్లారెడ్డికి చెందిన కాంట్రాక్టర్ ముందుకు వచ్చి మేకల సంతను దక్కించుకున్నారు.

డిగ్రీలో విద్యార్థుల ప్రతిభ

బాన్సువాడ: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో విడుదల చేసిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్‌లో బాన్సువాడ ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో కళాశాలకు చెందిన సభాసానియాకు బీజెడ్‌ఎస్‌పీలో 9.84 గ్రేడ్, సాధనకు బీకాంలో 9.68 గ్రేడ్, వసంతకు బీకాంలో 9.44 గ్రేడ్, బషీర బేగంకు బీజెడ్‌సీలో 9.44 గ్రేడ్, సానియాకు బీజెడ్‌సీలో 9.44 గ్రేడ్ వచ్చినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు అభినందనలు చెప్పారు.

అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నాయీ బ్రాహ్మణులు అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుపు వికాస్ నాయీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నాయీ బ్రాహ్మణులతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించి మంచి చదువులు చదివించి, అన్నిరంగాలలో రాణించేలా చూడాలన్నారు. అనంతరం శబరి మాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంటు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- వేసవిలో మద్నూర్ ప్రభుత్వాస్పత్రిలో మంచి నీరు కరువు



మద్నూర్ ప్రభుత్వాస్పత్రిలోని వాటర్ ప్లాంటు

మద్నూర్(జుక్కల్): ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినా అది సిబ్బంది నిర్లక్ష్యంతో నిరూపయోగంగా మారింది. దీంతో ఆస్పత్రిలో వైద్యం చేసుకునే రోగులకు మంచి నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ పనికి రాకుండా పోయింది. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొన్నా అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నుంచి వచ్చే నీరు తాగుతున్నామని రోగుల బంధువులు పేర్కొన్నారు. మండలంలోని నలు మూలల నుంచి నిత్యం రోగులు ఈ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటారు. ఆస్పత్రిలో తాగునీటి సౌకర్యం లేకపోవడం వలన రోగులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి కోసం బయట మార్కెట్‌లో డబ్బులు వెచ్చించి మంచి నీరు కొనాల్సి వస్తోందని వారు అంటున్నారు. రోగుల కోసం ఆస్పత్రిలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసినా ఏడాదిన్నర నుంచి అది పనిచేయకపోవడంతో నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. రోగులే కాకుండా ఆస్పత్రిలోని సిబ్బందికి కూడా నీటికి ఇబ్బందులు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

తాగునీరు లేదు



ఆస్పత్రిలో తాగునీరు లేదంటున్నారు. ఎండాకాలం వచ్చింది. పదినిమిషాల కొకసారి నాలుక ఎండిపోతుంది. నీళ్ల కోసం ఆస్పత్రిలో అడిగినా మంచినీరు లేదన్నారు. ఇంత పెద్ద దవాఖానలో మంచినీరు దొరకడం లేదంటే నమ్మబుద్ధి కావడం లేదు. సార్లు తాగు నీటికి ఏర్పాటు చేయాలే.

–శ్రీకాంత్, పెద్ద ఎక్లార

డబ్బులు పెట్టి కొనుక్కుంటున్నాం



ఆస్పత్రిలో గుక్కెడు తాగునీటి కోసం రోగులు ఆవస్థలు పడుతున్నారు. డబ్బులు పెట్టి బయట కొనుక్కుంటున్నా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పట్టించుకుంటలేరు. వేసవి కాలంతో రోగులు దప్పికతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు.

–లక్ష్మణ్, మద్నూర్

ఉచిత న్యాయ సాయం అందించేందుకు సిద్ధం

- కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ గుప్తా



శ్రీధర్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

భిక్కనూరు: అవసరమైన వారికి ఉచితంగా న్యాయ సాయం అందించేందుకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్ గుప్తా అన్నారు. మంగళవారం భిక్కనూరు ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శ్రీధర్ గుప్తాను కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు సన్మానించారు. శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా జీవించాలన్నారు. సంఘం ప్రధానకార్యదర్శి గంగెల్లి మధుసూదన్, కోశాధికారి కొడిప్యాక అంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురాం రాజమౌళి, పాల్గొన్నారు.

చెక్కులను సకాలంలో పంపిణీ చేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్



మాట్లాడుతున్న పీఆర్ డీఈఈ గిరి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. చెక్కులను సకాలంలో పంపిణీ చేయకపోవడం వల్ల అవి గడువుతీరిపోయి వెనక్కి వెళ్లిపోతున్నాయన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాలకు మంజూరయ్యే బ్యాంకు రుణాలలో సేవా రుసుము పేరిట 0.5 శాతం డబ్బులను వసూలు చేస్తున్నారని, ఆ డబ్బులను ఎందుకు వినియోగిస్తున్నారో స్పష్టత ఇవ్వాలని నాగిరెడ్డిపేట సర్పంచ్ సునీతా రెడ్డి సభలో ఏపీఎం జగదీశ్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఏపీఎం బదులిస్తూ.. మహిళా సంఘాల నుంచి వసూలు చేసిన 0.5శాతం డబ్బులలో 0.2 శాతం గ్రామ సంఘానికి, 0.3 మండల సమాఖ్య ఖాతాల్లో జమ చేస్తారని, వీటిని సమాఖ్య సమావేశాల ఖర్చులకు వినియోగిస్తారన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు వేసేటప్పుడు ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ రాజ్‌దాస్, పీఆర్ ఏఈ కృష్ణకు సూచించారు. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, పీఆర్ డీఈఈ గిరితోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గాంధారి పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్సై సుధాకర్

గాంధారి(ఎల్లారెడ్డి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ బుక్కు తప్పనిసరి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు ఉంటే అధిక సౌండ్ పెట్టవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు.

సంక్షిప్తం

నాయీ బ్రాహ్మణ మండల కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల జనశక్తి నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వికాస్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా స్వామి, గౌరవ అధ్యక్షుడిగా అంజయ్య, ఉపాధ్యక్షులు సురేష్, అంజనేయులు, రాజు, కిరణ్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ఎల్లారెడ్డి: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని వైద్యుడు అరుణ్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపేట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ నారాయణ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, ఎంపీటీసీ కళావతి హన్మాండ్లు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ మెట్ల పనులకు భూమిపూజ

దోమకొండ: మండల కేంద్రంలోని కుడి చెరువు వద్ద బతుకమ్మ మెట్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. గడికోట ట్రస్టు ఆర్థిక సహకారంతో రూ.8 లక్షలతో పనులను చేపట్టినట్లు జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, ఇరిగేషన్ ఈఈ అర్చన, ఏఈ బాలకృష్ణ, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి స్పీకర్‌కు ఆహ్వానం

బాన్సువాడ: ఈ నెల 6న జరిగే హనుమాన్ జయంతి వేడుకలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పెద్ద హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని, ఆలయంలో పూజలు చేయాలని స్పీకర్‌ను కోరారు. ఆలయ కమిటీ సభ్యులు నార్ల ఉదయ్, గంప బాలు, తదితరులు ఉన్నారు.

ఛత్రపతి సేవాదళ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమీపంలో మంగళవారం ఛత్రపతి శివాజీ సేవాదళ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సేవాదళ్ అధ్యక్షుడు పన్యాల బాపురెడ్డి ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పొల్కంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామంలోని చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నరాంపూర్‌లో హనుమాన్ స్వాములకు భిక్ష

బాన్సువాడ రూరల్: చిన్న రాంపూర్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మలేషియా ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షులు మారుతి కుర్మ, హనుమాన్ దీక్ష స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు. దీక్షా స్వాములతో కలిసి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోచారం, బస్వాయిపల్లి, దుర్కి తదితర గ్రామాలకు చెందిన హనుమాన్ గురుస్వాములు విజయ్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కుర్మగణేష్, తదితరులు కూడా హాజరయ్యారు.

పెద్దమల్లారెడ్డిలో అన్నదానం

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలో హనుమాన్ స్వాములు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయంలో సింధూరపూజలు, తమలపాకుల పూజలు చేశారు. సామూహికంగా 108 పర్యాయాలు హన్‌మాన్ చాలీసాను పఠించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పిట్లం(జుక్కల్): గౌరారంలో గ్రామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం గ్రామ సర్పంచ్ అనసూయ, నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకుని అనంతరం టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

రాజంపేట: మండలంలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శాంతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ..పాస్‌బుక్‌లలో పేర్లు తప్పుగా నమోదైన రైతుల వివరాలను సవరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

'చేపల పెంపకంతో ఉపాధి'



మాచారెడ్డి: చేపల పెంపకం ద్వారా మహిళలు ఉపాధి పొందాలని మాచారెడ్డి ఎంపీపీ ఎల్.నర్సింగరావ్ సూచించారు. బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేపల పెంపకం యూనిట్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల పెంపకం కోసం మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. చేపల పెంపకంలో మెలకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మీనా, డీఆర్‌డీవో సాయన్న, ఏపీడీ మురళీ క్రిష్ణ, డీపీఎం రమేశ్, ఏపీఎం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ మంగళవారం తెలిపారు. వివరాలు.. తండాకు చెందిన గుగులోత్ రాజు సోదరి శారదకు నాలుగేళ్ల క్రితం మెదక్ జిల్లా పుల్చర మండలం రంగంపేట తండాకు చెందిన లక్ష్మణ్‌తో వివాహం జరిగింది. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. సంసారంలో గొడవలు తలెత్తడంతో ఏడాది క్రితం శారద క్యాసంపల్లి తండాలోని తన తల్లి ఇంటి వద్దకు వచ్చి ఉంటోంది. ఈనెల 1న ఆమె భర్త క్యాసంపల్లి తండాకు వచ్చి తన కుమారుడిని వెంట తీసుకెళ్లాడు. 2న శారద తన భర్త దగ్గరకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాజు తన బావ లక్ష్మణ్‌కు ఫోన్ చేయగా ఇంటికి రాలేదని చెప్పాడు. చాలా చోట్ల వెతికినా శారద ఆచూకీ దొరకలేదు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల అక్రమాలను వివరించాలి



మాట్లాడుతున్న రమేశ్ రెడ్డి

భిక్కనూరు: అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలు చేసిన అక్రమాలు అవినీతి గురించి ఇప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం రామేశ్వర్‌పల్లి మార్కండేయ ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి బీజేపీ కార్యకర్త నరేంద్రమోదీ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. నరేంద్రమోదీ అవినీతి రహిత దేశంగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింలు, సాయిలు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



డోంగ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్: సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. డోంగ్లీ తహసీల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్, పల్లె పల్లెకు స్వచ్ఛమైన మంచినీరు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ అందిస్తున్నారన్నారు. రైతన్న సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అందిస్తున్న విషయం ఇక్కడున్న ప్రతి రైతుకు తెలిసిందేనన్నారు. డోంగ్లీ మండలంలోని 6 వేల మంది రైతులకు ఐదేళ్లలో రూ.75 కోట్లు రైతుబంధు కింద అందించాని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం పరితపిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో 11 గ్రామాలకు రోడ్లు లేవని ఇటీవల బాన్సువాడకు వచ్చిన కేసీఆర్‌కు విన్నవించానని చెప్పారు. నూతన మండలంగా ఏర్పడిన డోంగ్లీలో జూనియర్ కళాశాల, మద్నూర్‌లో డిగ్రీ కళాశాల త్వరలో ఏర్పాటు అవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను గ్రామాల వారీగా పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. సర్పంచ్ మాధవి, ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్నూర్(జుక్కల్): కల్యాణ లక్ష్మి, షాదీము బారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో మంగళవారం పలు గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న సుభాష్‌రెడ్డి

తాడ్వాయి/గాంధారి: ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి, గాంధారి మండలాల్లో పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు.

మల్లయ్యపల్లిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్లయ్యపల్లిలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు నాయకులు పంపిణీ చేశారు. పార్టీలో సభ్యులుగా చేరిన వారికి కాంగ్రెస్ నాయకులు సభ్యత్వ కార్డులను అందించారు. పార్టీలో సభ్యులుగా చేరిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన విండో డైరెక్టర్ గాదారి నర్సారెడ్డి, మాజీ వీడీసీ అధ్యక్షుడు జనగామ రాజు, ఎల్లయ్య తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ఆహ్వానించారు. నాయకులు కోతి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దశరథ్ రెడ్డి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): కన్నాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాజనర్స్‌తో కలిసి రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఉపసర్పంచ్ అంజిల్‌రెడ్డి, వైద్యులు చైతన్య, సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

చిన్నతక్కడ్‌పల్లిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): చిన్నతక్కడ్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మిర్జాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో) లక్ష్మణ్ సింగ్ పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి కంటి పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ పురం లక్ష్మి ,రైతు బంధు అధ్యక్షులు వెంకట రమణ, డాక్టర్లు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



మీర్జాపూర్‌లో మాట్లాడుతున్న పెర్క శ్రీనివాస్



బైరాపూర్‌లో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మీర్జాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాల ఉన్నాయన్నారు. ప్రతి పథకం గురించి గడప గడపకు తిరుగుతూ ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎంపీపీ పాల్త్య విఠల్, నాయకుల వెంకట రమణ ,ప్రతాప్ సింగ్ ఉన్నారు.

బీర్కూర్ మండలం బైరాపూర్‌లో..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలం బైరాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలకు బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ దిశానిర్దేశం అన్నారు. మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట లాడేగాం గంగారాం, వీరేశం, దుంపల రాజు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

సమాచారం..

నేడు రాములవారి రథోత్సవం

ఎల్లారెడ్డి: పట్టణంలోని సీతారాముల రథోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మంగళవారం తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

జగ్జీవన్ రామ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ: స్థానిక తహసీల్ కార్యాలయం ముందు ఉన్న ఖాళీ స్థలంలో బాబూ జగ్జీవన్ రావు విగ్రహానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు బాబా జగ్జీవన్‌రామ్ యువజన డివిజన్ కమిటీ అధ్యక్షులు గంగారం తెలిపారు. భూమి పూజ అనంతరం మీనా గార్డెన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

6న హనుమాన్ జయంతి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 6న ఉదయం 11గంటలకు సామూహిక శ్రీనవ దుర్గావ్రతం, హనుమాన్ జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం కామారెడ్డి పట్టణ పరిధిలోని భూకన్‌పల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో సింధూర పూజలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎల్లారెడ్డిలో హనుమాన్ శోభాయాత్ర

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో ఈ నెల 6న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ నేతలు మంగళవారం తెలిపారు. పప్పు హనుమాన్ ఆలయం నుంచి రామాలయం వరకు శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.